క్లుప్తంగా

సరిహద్దు వద్ద అప్రమత్తంగా ఉండాలి



మాధవరం చెక్‌పోస్టు పరిసరాలను పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

మంత్రాలయం: రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి కర్ణాటక మద్యం దిగుమతిని అరికట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న సెబ్ తనిఖీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి ఏపీ వైపు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించాలని చెప్పారు. సీఐలు జయరాంనాయుడు, రాజశేఖర్‌గౌడ్, ఎస్‌ఐ సోమ్‌శేఖర్‌రావు ఉన్నారు.

సెబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న నాగమద్దయ్య

కోసిగి: స్థానిక సెబ్ స్టేషన్ కార్యాలయాన్ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నాగమద్దయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రెండేళ్లుగా అక్రమ మద్యం పట్టుకున్న రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నదీతీర ప్రాంతాల్లో అక్రమ మద్యం అరికట్టేలా చూడాలన్నారు. కర్ణాటక మద్యం తరలి రాకుండా ఎక్కడికక్కడే చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కర్నూలు సెబ్ అడిషనల్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ, సీఐ సృజన్‌బాబు ఉన్నారు.

నెట్టెకల్లు కొండల్లో చిరుత సంచారం!

ఆదోని సెంట్రల్: మండలంలోని నెట్టెకల్లు గ్రామ శివారునున్న కొండల్లో చిరుత సంచరిస్తుందని గ్రామస్తులు బుధవారం తెలిపారు. సాయంకాలం కొందరు రైతులు పొలాల నుంచి వస్తుండగా చిరుతను చూసినట్లు చెప్పడంతో గ్రామంతో తెలిసిపోయింది. దీంతో పొలాలకు వెళ్లడానికి జంకుతున్నారు. ఉదయం పనులకు ఎలా వెళ్లాలని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్వని వివరణ కోరగా.. ఇంత వరకు తమకు సమాచారం అందలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్ : మండలంలోని మండిగిరి గ్రామంలోని భరత్‌నగర్‌లో బుధవారం బాల బ్రహ్మ మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండిగిరి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, నాయకులు ఉలిగప్ప, కార్తీక్, ఈరన్న పాల్గొని ప్రారంభించారు. బిణిగేరి రాజు, పాల వీరేష్, ఈశ్వర్, మధు, నాగేంద్ర, నరసింహా, చిన్నా, యల్లప్ప, రామన్న పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

మంత్రాలయం: స్థానిక శ్మశాన వాటిక వద్ద ఖాసీం అనే రైతుకు చెందిన గడ్డివాము బుధవారం దగ్ధమైంది. గమనించిన స్థానికులు నీటితో మంటలను ఆర్పేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని రైతు వాపోయారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆలూరు ఏఈ లోకేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ప్రతిపాదనలు పంపించామని.. త్వరలో వాటిని మార్చేస్తామన్నారు. గృహ, గృహేతర విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే ఫోన్ 9440813390కు కాల్ చేసి తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పదోన్నతి నిలుపుదలపై విచారణ

కర్నూలు సిటీ: హోళగుంద మండలం మార్లమడికి ఎంపీయూపీ స్కూల్లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న తేనె సాయిబాబాకు రెండు నెలల క్రితం విద్యాశాఖలో కేటాయించిన పదోన్నతి, బదిలీని నిలుపుదల చేశారు. దీనిపై డీఈఓ రంగారెడ్డి జేడీ సర్వీసెస్ మువ్వా రామలింగంపై హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్‌కు సైతం చేసిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట కృష్ణారెడ్డిని ఆదేశించారు. దీంతో ఆర్జేడీ కార్యాలయం సిబ్బంది బుధవారం డీఈఓ కార్యాలయానికి వచ్చి డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యాముల్‌పాల్, సూపరింటెండెంట్లు రాజశేఖర్, రవికుమార్‌తో సాయిబాబా ఫిర్యాదుపై చర్చించారు. గురువారం ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి కర్నూలుకు రానున్నారు. దీంతో వివరాలతో కూడిన ఫైలును డీఈఓ ఆఫీస్ సిబ్బంది సిద్ధం చేసుకుంటున్నారు.










మంత్రాలయం: తుంగభద్ర నదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు,వేలం పాటలో లడ్డును కైవసం చేసుకున్న అంజనేయులు, కోసిగి: వేలంలో కైవసం చేసుకున్న లడ్డూను ఊరేగిస్తున్న భక్తులు, ముస్లింల మజ్జిగ పంపిణీలో మాట్లాడుతున్న సీఐ

గంగ ఒడి చేరిన గణనాథుడు

- మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడు
- గ్రామాల్లో ప్రత్యేక పూజలు, లడ్డూల వేలం, అన్నదానం
- రంగులు చల్లుకుంటూ, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపుగా శోభాయాత్ర
- తుంగభద్ర నది, ఎల్‌ఎల్‌సీలో విగ్రహాల నిమజ్జనం
- ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



కోసిగిలో గణనాథుడిని కలశాలతో ఊరేగిస్తున్న భక్తులు





కౌతాళం మెయిన్ బజారులో గణపయ్యల ఊరేగింపు, నిమజ్జనానికి ఊరేగింపుగా బయలు దేరిన గణనాథులు

మంత్రాలయం: వినాయక చవితిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు భక్తులతో విశేష పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం రాత్రి గంగమ్మ ఒడికి చేరాడు. మంత్రాలయం, చెట్నిహళ్లి, మాధవరం, రచ్చుమర్రి,మాలపల్లి, తుంగభద్ర, కల్లుదేవకుంట, చిలకలడోణ గ్రామాల ప్రజలు అయా గ్రామాల నుంచి ఉరేగింపుగా తుంగభద్ర నది చేరుకున్నారు. నది తీరంలో గణనాథుడికి చివరి సారిగా పూజలు నిర్వహించి నదిలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మంత్రాలయం,మాధవరం ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా.. ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల వద్ద నిర్వహించిన లడ్డు వేలంలో భక్తులు పాల్గొన్నారు. మాలపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాగణపతి లడ్డును అంజనేయులు అనే భక్తుడు రూ.86,516లకు సొంతం చేసుకున్నారు.

కోసిగి: మండల కేంద్రంలో గణనాథుల నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం మార్కండేయ స్వామి దేవాలయం, మారెమ్మ గుడి, రామక్కమ్మ కాలనీ, కడపాళెం, దుర్గమ్మ కాలనీ, ఎల్లమ్మ ఆలయం ప్రాంగణం, ఎన్టీఆర్, కాలనీ, ఎల్లమ్మ దేవాలయం, అలుకూరప్ప మఠం, కాశమ్మ గడ్డ, రైల్వే స్టేషన్ కాలనీ, గుడిసెల్లో కొలువుతీరిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం విగ్రహాలను ట్రాక్టర్లపై కొలువుంచి కలశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా బయలు దేరి ప్రధాన రోడ్డు మీదుగా కడపాళెం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. గాంధీనగర్ కాలనీలో లడ్డు వేలం రూ.18,001లకు పెండేకంటి నరసయ్య, టెంకాయ వేలం రూ.3001కు తిమ్మప్ప కైవసం చేసుకున్నారు. మాధవరం సమీపంలో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. మరికొందరు పులికనుమ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేపట్టారు. సీఐ ఎరిసా వలి, ఏఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దకడబూరు : మండలంలో బుధవారం వినాయక నిమజ్జనాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చిన్నతుంబళం, బసలదొడ్డి, హెచ్.మురవణి, కంబదహాల్, కల్లుకుంట, కంబలదిన్నె గ్రామాల్లో ఉదయం వినాయక లడ్డూలు వేలం వేశారు. మండల కేంద్రంలో యువత డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలించారు. ఆదోని ప్రధాన రహదారిలోని ఎల్‌ఎల్‌సీ కాలువలో నిమజ్జనం గావించారు. ఎస్‌ఐ మహేష్‌కుమార్ బందోబస్తు చేపట్టారు.



కౌతాళం: నిమజ్జనోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మత్స్య గణపతి





పెద్దకడబూరులో నిమజ్జనానికి తరలుతున్న ఏకదంతుడు, కౌతాళంలో విద్యార్థినుల కేరింతలు

కౌతాళం: మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం బుధవారం వైభవంగా కొనసాగింది. గ్రామంలో కొలువైన గణేష్ విగ్రహాలను సాయంత్రం నాలుగ గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. యువకుల నృత్యాలు, మేళతాలు, డప్పువాయిద్యాల నడుమ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కౌతాళంలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుల ఊరేగింపు కార్యక్రమం కొనసాగగా విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి మారుతీమోహన్ ఆధ్వర్యంలో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలను తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. ఆదోని ట్రాఫిక్ సీఐ పార్థసారథి పోలీసు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ..

ముస్లింల సోదరభావం అభినందనీయమని ఆదోని ట్రాఫిక్ సీఐ పార్థసారథి, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారుతిమోహన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిమజ్జన కార్యక్రమంలో మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మదీనా మసీదు వద్ద నీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్బారాజుతో కలసి ప్రారంభించారు. అలాగే.. ఎల్‌ఎల్‌సీ కాలువ వద్దకు గణేష్ నిమజ్జనానికి వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అల్పాహారం అందజేశారు.

పకడ్బందీగా ఓటర్ల ఇంటింటి సర్వే

ఆదోనిరూరల్ : ఓటర్ల ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. బుధవారం సబ్‌కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపడుతున్నామన్నారు. ఒకే కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఓటర్ల పరిశీలన సమయంలో వెరిఫికేషన్ సక్రమంగా చేసేలా చూడాలని, కొన్ని ప్రాంతాల్లో వలస వెళ్లిన కుటుంబాల ఓట్లను కూడా పరిశీలించాలని, ప్రతి ఓటరు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కూడా కల్పించాలని, క్షేత్రస్థాయిలో ఓటుహక్కు అవగాహనపై జన సమూహం గల ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సర్వే సక్రమంగా నిర్వహించని వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటు నమోదుపై క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారం చేపట్టామని, అవసరమైతే ఇంకా ఎక్కువగా ప్రచారం చేయిస్తామని, ప్రతి ఓటరు రెండు కి.మీ. కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పౌష్టికాహారం పంపిణీ

ఆదోనిఅర్బన్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), లయన్స్ క్లబ్ ఆదోని శాఖల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలోని టీబీ కేంద్రం ఆవరణలో పౌష్టికాహారం అందజేశారు. ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం రోగులకు ఎంతో అవసరమని గుర్తించి కిట్లు అందజేసినట్లు చెప్పారు. ఇలా ప్రతి రోగికి ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందజేస్తామన్నారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ కృష్ణమూర్తి, ఆదోని టీబీ ఆఫీసర్ డాక్టర్ షేకున్ బాను, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, టీబీ శాఖ నుంచి బాబురావు, సూపర్‌వైజర్ ఉమాపతి, కో–ఆర్డినేటర్ వీరేష్ పాల్గొన్నారు.



టీబీ రోగులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

ఆదోని సెంట్రల్: డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని, సొంత భవన నిర్మాణానికి రూ.12.50 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధువారం వైఎంకే పాఠశాల భవనంలో నూతన డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ముందుగా సరస్వతి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబునాయుడు డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని జీఓ ఇచ్చి అమలు చేయలేకపోయాడని విమర్శించారు. అయితే గత ఏడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదోని పర్యటనకు వచ్చినపుడు విద్యార్థి సంఘాలు, నాయకులు, ప్రజలు కోరిక మేరకు డిగ్రీ కళాశాల మంజూరు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కళాశాల మంజూరు చేశారన్నారు. అయితే కొందరు నాయకులు కళాశాల ఏర్పాటుపై విమర్శలు చేయడం తగదన్నారు. మంచి పని చేసినపుడు సంతోషపడాలి కానీ.. విమర్శలు చేయడం తగదన్నారు. చివరికి దీనిని కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడే ప్రభుత్వం కనుక వెంటనే రెగ్యులర్ ప్రిన్సిపాల్, ఆరుగురు అధ్యాపకులను నియమించిదని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కూడా చొరవ తీసుకొని విద్యార్థులను కళాశాలలో చేరేందుకు అవగాహన కల్పించాడని తెలిపారు. కళాశాలపై నమ్మకంతో చేరిన 26 మంది విద్యార్థులను అభినందించారు. పురపాలక చైర్మన్ బి.శాంత, ఎంఈఓ బి. శివరాములు, ప్రిన్సిపాల్ శివారెడ్డి, నాయకులు నరసింహమూర్తి, ఈరన్న, అధ్యాపకులు కిరణ్‌కుమార్, రాఘవేంద్ర పాల్గొన్నారు.



విద్యార్థులు, అధ్యాపకులతో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి

క్రీడా పోటీల్లో మన ప్రతిభను కనపరచాలి

నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభను కనపరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మొదట హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి పురపాలక పాఠశాల అవరణలో స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం ప్రారంభించారు. ఎంఈఓ బి.శివరాములు మాట్లాడుతూ అండర్– 14,17 పోటీల్లో ప్రతిభ చూపిన వారు జిల్లా స్థాయి జట్టుకు ఎంపికవుతారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్ , టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ వంటి పోటీలు ఉంటాయని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే పోటీల్లో మొదటి రోజు బాలికలకు రెండవ రోజు బాలురకు, మూడవ రోజు బాలబాలికలకు కలిపి పోటీలు ఉంటాయని వివరించారు. శుక్రవారం పట్టణంలో గణేష్ నిమజ్జనం ఉన్నందున శనివారం పోటీలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఆలూరు: హెచ్ఎల్లెల్సీ కాలువ సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హెచ్ఎల్లెల్సీ డీఈ మంజునాథ్‌గౌడు తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. నాన్‌ఆయకట్టు సాగుకు రైతులు సాగునీటిని వాడుకునే అంశంపై ఏఈ తిమ్మారెడ్డి పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో ఆయకట్టు, నాన్‌ఆయకట్టును పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ సుబ్బారాజు సభను ప్రారంభించి వివిధ అంశాలపై వివరించారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న పనితీరుపై కౌతాళం, బంటకుంట గ్రామాల సర్పంచ్‌లు పాల్‌దినకరన్, గోపాల్ రెడ్డి వైస్ ఎంపీపీ రామలింగయ్య స్వామి అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల ఫోన్‌లను రిసీవ్ చేసుకోడని మండలంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ఉన్నత అధికారులు సిద్ధంగా ఉన్నా ఎన్ని దెబ్బతిన్నాయో తెలియదని చెప్పడాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఏఈ నరసన్నపై అగ్రహం వ్యక్తం చేస్తూ పని చేయడం ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లిపోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో మండల, గ్రామ నాయకులకు సమాచారం అవసరం అన్నారు. రౌడూరు గ్రామంలో ఎస్సీలకు శ్మశాన వాటికకు 87 సెంట్ల స్థలానికి చెందిన పత్రాలను పాస్టర్‌కు గ్రామ నాయకులు సుధాకర్ రెడ్డి, పాండురంగారెడ్డితో కలసి అందజేశారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, నిఖితరెడ్డి, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆర్బీకే, సచివాలయ భవనాల ప్రారంభం..

ప్రజలకు అవసరమైన సేవలను వారి ముంగిటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మండలంలోని బాపురం గ్రామంలో బుధవారం నూతనంగా రూ. 21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గ్రామ సర్పంచ్ శిల్పారెడ్డి, ఎంపీటీసీ సౌభాగ్యమ్మతో కలసి ప్రారంభించారు. నాయకులు గురునాథరెడ్డి, జైపాల్, ప్రహ్లాదాచారి, కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, వీరసేనారెడ్డి, ఎంపీపీ అమరేశ, అధికారులు పాల్గొన్నారు.







విక్టోరియాపేటలో వెంకటేశ్వరస్వామి అలంకారంలో వినాయకుడు, చౌదరిబావి సమీపంలోకాళింగమర్దన గణపతి, కొత్త ఓవర్‌బ్రిడ్జి సమీపంలో శ్రీకృష్ణ రూపంలో..

లంబోదరా నమోస్తుతే..

ఆదోనిఅర్బన్ : వినాయకచవితి సందర్భంగా నెలకొల్పిన మండపాల్లో గణేడు మూడు రోజు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. వివిధ రూపాల్లో నున్న స్వామి వారికి ఆయా కాలనీల్లో ప్రజలు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు చేపట్టిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆంజనేయస్వామిగా గణనాథుడు





విక్టోరియాపేటలో గణనాథుడి పూజలో పాల్గొన్న భక్తులు, డీఎస్పీ బంగ్లా సమీపంలో చైనీయుల ఆకృతిలో గణపతి



పాండురంగస్వామి ఆలయ సమీపంలో పరశురాముడిగా రూపంలో విఘ్నేశ్వరుడు

బీమా తక్షణ సాయం అందజేత

ఆదోనిరూరల్ : మండిగిరిలో బుజ్జి అనే వ్యక్తి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో పథకం తక్షణ సాయం కింద రూ.10 వేలను నామినీ అయిన మాదిగ జ్యోతమ్మకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ అందజేశారు.